# హెలికాప్టర్లు కిందకి దిగి వచ్చేసాయి!

(పరిశీలన : డా. యేలూరిపాటి అపర్ణ, న్యూజెర్సీ)

"హెలికాప్టర్లు కిందకి దిగి వచ్చేసాయి" అనే ఈ కథ మొదటిసారిగా 1970 లో ప్రచురించబడింది. వ్రాసి ఇప్పటికి సుమారు చాలాకాలం అయింది. రచయిత సామాన్యులు కారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, సాహిత్య అకాడమీ, సంగీత నాటక అకాడమీ అవార్డులను, సరస్వతీ సమ్మాన్ వంటి పురస్కారాలను పొందిన శ్రీ ఇందిరా పార్థసారథి గారు. ప్రపంచాన్ని చదివిన మేధావి. వ్యక్తులను, పరిస్థితులను, ఆలోచనలను, తర్కాతర్కాలను అంచనా వేయగల మనస్తత్వవేత్త.

కథ విషయానికి వస్తే, ఇది వ్రాయబడి చాలాకాలం అయినప్పటికీ, ఈనాటికీ, ఏనాటికీ పాతబడని నిత్యనూతనమైన కథ. భార్యాభర్తల అనుబంధం, వారి మధ్య ఉండే స్వత్వ భావన, వ్యక్తులకు కలిగే ఆకర్షణ-వికర్షణలు, మానసిక సంఘర్షణలు, కాలానుగుణంగా వ్యక్తులలో, ఆలోచనలలో వచ్చే మార్పుచేర్పులకు ఈ నవల అద్దం పట్టింది. ఇది ముఖ్యంగా అమృతం, తిలకం, భానుమతి అనే పాత్రల మధ్య నడిచే ముక్కోణపు కథ అయినప్పటికీ, ఇందులో కనబడని నాలుగో పాత్ర అమృతం ప్రేయసి నిత్యా. ఆమె ప్రత్యక్షంగా కథలో లేకపోయినా, అమృతం ఆలోచనల్లో ఆమె రాని సంఘటనే లేదు. అమృతం, తిలకం అనే నడివయసులో అడుగు పెడుతున్న దంపతులకు పెళ్ళి అయి చాలాకాలం అయినా, పిల్లలు కలగకపోవడం వల్ల బహుశా అమృతం 'నాభార్య, నా కుటుంబం' అనే బాధ్యతలను పూర్తిగా స్వీకరించకుండా, ఇంకా తన యౌవనకాలంలో జరిగిన ప్రేమకథనే తలచుకుంటూ ఉన్నాడేమో అని అనిపిస్తుంది. తన స్నేహితుడైన బెనర్జీతో అమృతం "నా యవ్వనం పునరుజ్జీవింపజేయాలని నా అభిలాష. అదే భావన, అదే ఆవేశం,

అదే క్రియ. గతకాల చరిత్రని కొనసాగించాలని నా ఆశ" అనే ఘట్టంలో ఈ విషయం స్పష్టమౌతుంది.

సంఘంలో మర్యాదస్తుడిగా, మంచి ఉద్యోగస్తుడిగా జీవనం కొనసాగిస్తున్నా, తను వెళ్ళిన, చూసిన ప్రతి ఘట్టంలోనూ అమృతం తన ప్రేయసిని స్మరిస్తూనే ఉంటాడు. ముఖ్యంగా భానుమతిని అమృతం చూసిన, కలిసిన తొలి క్షణం నుంచి అతని ప్రేయసి నిత్యా ప్రస్తావన కథనిండా, కదులుతూనే ఉంది. తిలకం సగటు ఇల్లాలు. ఇదీ అని ప్రత్యేకించి చెప్పుకొనే విషయాలు లేకున్నా, 'నా ఇల్లు, నా భర్త, అతని ప్రేమ, చనువు, అతనితో బయట తిరగాలి' అనే ఆశ ఉన్న మహిళ. ఇతర స్త్రీలలాగా భర్తను కొంగున ముడి వేసుకోవాలనీ, డ్రైవింగులాంటి విద్యలు నేర్చుకోవాలనీ ఆశలున్నా, తన క్రీగంటి చూపుల వెంట అతన్ని త్రిప్పుకొనే చాతుర్యం లేనిది. అతని ప్రేమను సొంతం చేసుకోవాలనే ఆరాటం, అతను దూరమౌతాడని ఆక్రోశం సమపాళ్ళలో ఉన్న కౌటుంబిక స్త్రీ. కథ చివరిలో భర్తకు "మీరు ఎవరితో వెళ్ళారో నాకు తెలుసు. ఎందుకీ భార్యా-భర్తా నాటకం? నాకు నన్ను కాపుకోడం తెలుసు" అని ఉత్తరం వ్రాసిపెట్టి, భర్తను, ఇంటిని వదలి వెళ్లిపోయినట్టుగా కనబడుతున్నా, అలా వదిలి మాత్రం ఉండలేదు అనేది సుస్పష్టం. కాబట్టి, ఆమె తప్పకుండా తిరిగి వస్తుందని పాఠకులు నమ్మవచ్చు.

భాను పాత్ర విచిత్రమైనది. తల్లి స్వభావంగాని, ఆమె కట్టడిగాని ఆమెకు నచ్చదు. పురుషులలోని స్త్రీకాంక్ష ఆమెకు సుతరామూ గిట్టదు. అందుకే ఆమెకు యవ్వనంలో ఉన్న మగవారు అంటే ఏవగింపు. ఏ కారణంవల్లనో ఆమె అమృతాన్ని నమ్మి దగ్గరయ్యింది. కాని, ఒకటి రెండురోజుల్లోనే అతను తన్ను ఒక హోటలుకు తీసుకురావడాన్ని ఆమె జీర్ణించుకోలేక పోయింది. "మీరు మీ భార్యకు విడాకులు ఇచ్చి నన్ను పెళ్ళి చేసుకుంటారా?" అని అడిగినప్పుడు అతని ప్రతిస్పందన, ఆవేశం చూసి, ఆమెకు అతను అందుకు సిద్ధంగా లేడు అనే విషయం అర్థం అయ్యింది. చివరికి వారిద్దరూ విడిపోయేముందు ఆమె పలికిన మాటల్లో ఆమె ఇంకా ఇతన్ని కలవడానికి సిద్ధంగా లేదు అని తెలిసిపోతుంది. "నాకింతవరకూ యువకులంటే అసహ్యంగా ఉండేది. కాని ఇప్పుడు మగవారంటేనే

కలుగుతోంది. చిన్నా పెద్దా భేదం లేకుండా అందరూ మూర్ఖులే" అని అంటుంది. కాని నిజంగానే అతడు విడాకులకు సిద్ధపడి ఉంటే ఆమె అతన్ని ఏమనేదో అనేది పాఠకులకు ప్రశ్నే. నిజానికి అల  సిద్ధపడిన పురుషుణ్ణికూడా ఆమె క్షమించి ఉండదనే అనిపిస్తుంది.

ఈకథకు ప్రాణప్రాయమైన ఒక వాక్యం ఉంది. నిత్యా గురించి మాట్లాడుతూ భాను "మీరు నిత్యాను పెళ్ళి చేసుకుని ఉంటే, మీ భావనలో ఉన్న అమ్మాయిని మీరు పెళ్ళి చేసుకోలేదని తెలిసి ఉండేది. మీ స్నేహితురాలు నిత్యాకి, మీరు పెళ్ళాడిన నిత్యాకి భేదం ఉందని బోధపడి ఉండేది" అనీ, "ఏదో కారణం వలన మనం ఎవరినైనా మెచ్చుకుంటే వాళ్ళని మనం ఆదర్శ జీవులుగా భావిస్తాము, కానీ, వాళ్ళు అలాగే ఉండి తీరవలసిన అగత్యం లేదు" అంటుంది. మనకు అందనిది మరింత తీయగాను, అందినది పుల్లగాను అనిపించడం మానవసైజం అనే పచ్చి నిజాన్ని ఇక్కడ అనిపించారు రచయిత. అమృతం భానుతో తన పరిచయాన్ని తన వయసుకు తగదని కాని, తాను చేస్తున్నది సమంజసమా అని గాని, మొదటినుంచి సందేహిస్తూనే ఉన్నాడు. భార్య దగ్గర గాని, భాను దగ్గర గాని నిత్యా గురించి ప్రస్తావించడం ద్వారా, ఎవరు ఎలా స్వీకరించినా, తాను మాత్రం ఒకరకంగా తేలికపడిపోయాడు. చివరిలో ఇంటికి తిరిగి వచ్చాక, తిలకం కనబడక తల్లడిల్లాడు కూడా. భార్య ఇల్లు వదలి వెళ్ళడం ద్వారా తనకు కలిగిన స్వతంత్రత, తను కోరుకున్నదే అయినా, అతనికి నచ్చలేదు. గుంపులోనుంచి తప్పించుకోవాలనే మేకలాగాను, బోనులో చిక్కుకున్న చుంచెలుక లాగాను భయపడ్డాడు. సమాజమనే అనివార్యమైన చెరసాల తనకు సురక్షితమని అర్థం చేసుకున్నాడు.

నిజానికి అతనిలోని ఈ మార్పు అతనికే విచిత్రం. కథకు ఇదే సరైన ముగింపుకూడా.

*******